## ఐటీ సంస్థల ఆదాయం అదుర్స్

ముంబై, ఫిబ్రవరి 24: దేశీయ ఐటీ సంస్థలు అత్యధిక ఆదాయాన్ని ఆర్జిస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 282.6 బిలియన్ డాలర్లు, వచ్చే ఏడాది 300 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జించే అవకాశాలున్నాయని నాస్కాం అంచనావేస్తున్నది. క్రితం ఏడాది వచ్చిన ఆదాయంతో పోలిస్తే 5.1 శాతం వృద్ధిని నమోదు చేసుకోనున్నదని నాస్కాం ప్రెసిడెంట్ రాజేశ్ నంబియార్ తెలిపారు. ఐటీ సర్వీసెస్ కంపెనీలు, బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ కంపెనీలు, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు, ఈ-కామర్స్ కంపెనీలు సంయుక్తంగా ఈ ఏడాది కొత్తగా 1.26 లక్షల మందికి ఉపాధి కల్పించాయన్నారు. దీంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 58 లక్షలకు చేరుకున్నారు. 2024లో అంతర్జాతీయ ఐటీ కంపెనీలు నమోదు చేసుకున్న 4.7 శాతం వృద్ధితో పోలిస్తే దేశీయ ఐటీ సంస్థలు అంతకంటే ఎక్కువ వృద్ధిని నమోదు చేసుకోనున్నట్లు పేర్కొంది. కంపెనీల ఆదాయం 4.3 శాతం ఎగబాకి 137.1 బిలియన్ డాలర్లకు చేరుకోనుండగా, బీపీఎం ఇండస్ట్రీ 4.7 శాతం వృద్ధితో 54.6 బిలియన్ డాలర్లకు, ఇంజినీరింగ్ రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌లో 7 శాతం వృద్ధితో 55.6 బిలియన్ డాలర్లకు చేరుకోనున్నది.

# వాటాల అమ్మకంపై నజర్

### సర్కారీ బ్యాంకులు, ఆర్థిక సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణపై కేంద్ర ప్రభుత్వం దృష్టి

### సలహాల కోసం మర్చంట్ బ్యాంకర్లు, లీగల్ కంపెనీల నుంచి బిడ్ల ఆహ్వానం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: దేశీయ స్టాక్ మార్కెట్లలో నమోదైన సర్కారీ బ్యాంకుల్లో, ఆర్థిక సంస్థల్లో వాటాలను త్వరగా అమ్మేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈ క్రమంలోనే దాని సహాయార్థం ఆయా మర్చంట్ బ్యాంకర్లు, లీగల్ కంపెనీల నుంచి దరఖాస్తులను ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ, పెట్టుబడుల శాఖ (దీపం) సోమవారం ఆహ్వానించింది. బిడ్ల దాఖలుకు మర్చంట్ బ్యాంకర్లకున్న ఆఖరు తేదీ మార్చి 27. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఉండే దీపం.. ప్రభుత్వ రంగ సంస్థల్లో సర్కారీ వాటాల నిర్వహణను పర్యవేక్షిస్తూ ఉంటుంది. అయితే ఇప్పటికీ కొన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఆర్థిక సంస్థల్లో.. మార్కెట్ రెగ్యులేటర్ సెబీ నిబంధనల ప్రకారం 25 శాతం కనీస పబ్లిక్ షేర్‌హోల్డింగ్ నిబంధన అమలు కావడం లేదు. దీంతో వచ్చే ఏడాది ఆగస్టు 1నాటికి ఆయా సంస్థల్లో ప్రభుత్వ వాటాలను తగ్గించుకోవాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నది. ఇందులో భాగంగానే మర్చంట్ బ్యాంకర్లు-సెల్లింగ్ బ్రోకర్లు.. ఏ సంస్థల్లో వాటాలను ఎంతమేర, ఏ ధరకు, ఎప్పుడు అమ్మాలన్నదానిపై ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇవ్వనున్నాయి.

**90 శాతంపైనే**

ప్రస్తుతం ఐదు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో కేంద్రం వాటా 90 శాతానికిపైగానే ఉన్నది. వాటిలో పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ (98.3 శాతం), ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ (96.4 శాతం), యూకో బ్యాంక్ 95.4 శాతం, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (93.1 శాతం), బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (86.5 శాతం) ఉన్నాయి. అలాగే ఆర్థిక సంస్థ ఐఆర్‌ఎఫ్‌సీలో 86.36 శాతం, బీమా కంపెనీలైన న్యూ ఇండియా అస్యూరెన్స్‌లో 85.44 శాతం, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్‌లో 82.40 శాతం చొప్పున కేంద్ర ప్రభుత్వానికి వాటాలున్నాయి. కాగా, 2021-22 బడ్జెట్‌లోనే ఐడీబీఐ బ్యాంక్‌గాక, రెండు ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రైవేటీకరణను కేంద్రం ప్రతిపాదించింది. ఐడీబీఐ ప్రైవేటీకరణ ప్రక్రియ ప్రస్తుతం జరుగుతున్న విషయం తెలిసిందే.

**అమ్మకానికి 24 జాతీయ రోడ్లు**

ఆస్తుల నగదీకరణలో భాగంగా జాతీయ రహదారుల నిర్వహణ సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) దేశవ్యాప్తంగా 24 రోడ్లను అమ్మకానికి పెట్టింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో పలు రాష్ర్టాల్లోవున్న ఈ రోడ్లకు సంబంధించి ఆస్తులను అమ్మకం ద్వారా రూ.1,863 కోట్ల ఆదాయం లక్ష్యంగా పెట్టుకున్నది. ఇందుకోసం పలు రాష్ర్టాల్లోవున్న 1,472 కిలోమీటర్ల జాతీయ రహదారులను గుర్తించింది. విక్రయించనున్న రోడ్డు ప్రాజెక్టులలో ఐదు మహారాష్ట్ర రాష్ట్రంలో ఉండగా, నాలుగు ఝార్ఖండ్, మూడు ఉత్తరప్రదేశ్‌లలో ఉన్నట్లు ఎన్‌హెచ్‌ఏఐ తాజాగా విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొంది. అలాగే తెలంగాణతోపాటు బెంగాల్, బీహార్ రాష్ర్టాల్లో రెండేసి చొప్పున రోడ్లు ఉండగా.. ఛత్తీస్‌గఢ్, హర్యానా, గుజరాత్, కర్ణాటక, కేరళ, ఒడిశాల్లో ఒక్కో రోడ్డు ప్రాజెక్టు ఉన్నాయి.

## తక్కువ వడ్డీకే యూబీలో గృహ రుణాలు

ముంబై, ఫిబ్రవరి 24: రిజర్వు బ్యాంక్ కీలక వడ్డీరేట్లను పావు శాతం తగ్గించడంతో ఒక్కో బ్యాంక్ వడ్డీరేట్లను తగ్గిస్తున్నాయి. ఇప్పటికే బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ, ఇత ర బ్యాంకులు రెపో రేటుతో అనుసంధానమైన రుణాలపై వడ్డీరేట్లను తగ్గిస్తున్నాయి. దీంట్లోభాగంగా యూనియన్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్‌లు తమ గృహ రుణాలపై వడ్డీరేటును తగ్గించాయి. 20 ఏండ్ల కాలపరిమితితో గృహ రుణాలు తీసుకున్న వారికి ఈ రెండు బ్యాంకులు 8.10 శాతంవడ్డీకే రుణాలు అందిస్తున్నాయి. అంటే లక్ష రూపాయల రుణంపై ఈఎంఐ రూ.843గా నిర్ణయించింది. మిగతా బ్యాంకులు కూడా ఈ స్థాయిలోనే వడ్డీరేట్లను వసూలు చేస్తున్నాయి.

**గృహ రుణాలపై వడ్డీరేటు**

| బ్యాంక్ | వడ్డీరేటు (శాతంలో) | లక్ష రూపాయల రుణంపై ఈఎంఐ (20 ఏండ్లకు) |
|---|---|---|
| యూనియన్ బ్యాంక్ | 8.10 | 843 |
| సెంట్రల్ బ్యాంక్ | 8.10 | 843 |
| బ్యాంక్ ఆఫ్ బరోడా | 8.15 | 846 |
| పంజాబ్ నేషనల్ | 8.15 | 846 |
| కెనరా బ్యాంక్ | 8.15 | 846 |
| ఇండియన్ బ్యాంక్ | 8.15 | 846 |
| ఎస్బీఐ | 8.25 | 852 |
| బ్యాంక్ ఆఫ్ ఇండియా | 8.30 | 855 |
| ఐడీబీఐ బ్యాంక్ | 8.50 | 868 |
| హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ | 8.75 | 884 |

## హైదరాబాద్‌లో అమ్జెన్ నూతన కేంద్రం



హైదరాబాద్, ఫిబ్రవరి 24(నమస్తే తెలంగాణ): అమెరికాలోనే అతిపెద్ద బయో టెక్నాలజీ సంస్థ అమ్జెన్..హైదరాబాద్‌లో నూతన టెక్నాలజీ, ఇన్నోవేషన్ కేంద్రాన్ని ప్రారంభించింది. రహేజా నాలెడ్జ్ సిటీలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఐటీ-పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా కంపెనీ సీఈవో రాబర్ట్ బ్రాడ్‌వే మాట్లాడుతూ..వ్యాపార విస్తరణలో భాగంగా ఈ నూతన సెంటర్‌ను నెలకొల్పినట్లు, భవిష్యత్తులో 200 మిలియన్ డాలర్ల(రూ.1,600 కోట్లకు పైమాటే) పెట్టుబడి పెట్టాలనుకుంటున్నట్లు చెప్పారు.

**ఏఐలో పెట్టుబడులు పెట్టండి: శ్రీధర్ బాబు**

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదిత 'ఏఐ సిటీ'లో పెట్టుబడులు పెట్టాలని ఆస్ట్రేలియా - క్వీన్స్ లాండ్ ప్రభుత్వ ప్రతినిధులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. క్వీన్స్ లాండ్ రాష్ట్ర ఫైనాన్స్, ట్రేడ్, ఎంప్లాయ్ మెంట్ అండ్ ట్రైనింగ్ మంత్రి రాసిన్ బేట్స్ ఆధ్వర్యంలోని బృందం శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా 'తెలంగాణ-క్వీన్స్ లాండ్' మధ్య ప్రాధాన్య రంగాల్లో సంబంధాలను మెరుగుపర్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు ఆయన తెలిపారు.

**ఖనిజాల ఉత్పత్తికోసం అవగాహన**

క్రిటికల్ మైనింగ్ రంగంలో పరస్పర సహకారం కోసం క్వీన్స్‌లాండ్ (ఆస్ట్రేలియా)తో రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామ్యంకానుంది. 11 రకాల ఖనిజాల వెలికితీతలో పరస్పర సహకారం అందించుకోనున్నాయి.

# రూ.4.23 లక్షల కోట్లు ఔట్

### భారీ నష్టాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు

### పెద్ద ఎత్తున ఆవిరైన మదుపరుల సంపద

### సెన్సెక్స్ 857, నిఫ్టీ 243 పాయింట్లు క్షీణత

### దెబ్బతీసిన ఎఫ్ఐఐ పెట్టుబడుల ఉపసంహరణ



ముంబై, ఫిబ్రవరి 24: దేశీయ స్టాక్ మార్కెట్లలో వరుస నష్టాలు కొనసాగుతున్నాయి. దీంతో మదుపరుల సంపద కూడా లక్షల కోట్ల రూపాయల్లో ఆవిరైపోతున్నది. సోమవారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 856.65 పాయింట్లు లేదా 1.14 శాతం పతనమై 75వేల మార్కుకు దిగువన 74,454.41 వద్ద ముగిసింది. ఫలితంగా బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ ఈ ఒక్కరోజే రూ.4,22,983.08 కోట్లు హరించుకుపోయి రూ.3,97,97,305.47 కోట్ల (దాదాపు రూ.398 లక్షల కోట్లు) వద్ద నిలిచింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 242.55 పాయింట్లు లేదా 1.06 శాతం కోల్పోయి 22,553. 35 వద్ద నిలిచింది.

**అమ్మకాల ఒత్తిడి**

ఉదయం ఆరంభం నుంచే సూచీలు భారీ నష్టాల్లోకి జారుకున్నాయి. సమయం గడుస్తున్నకొద్దీ మదుపరులు పెట్టుబడుల ఉపసంహరణలకే పెద్దపీట వేశారు. దీంతో నష్టాలు మరింత పెరిగిపోయాయి. ఒకానొక దశలోనైతే సెన్సెక్స్ 923.62 పాయింట్లు దిగజారడం గమనార్హం. నిజానికి గత ఐదు రోజులుగా ఈక్విటీలు నేలచూపులే చూస్తున్నాయి. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 1,542.45 పాయింట్లు, నిఫ్టీ 406.15 పాయింట్లు క్షీణించాయి. దీంతో ఆయా సంస్థల మార్కెట్ విలువ కూడా భారీగానే ఆవిరైపోతున్నది.

**ఐటీ షేర్లు ధమాల్**

హెచ్‌సీఎల్ టెక్, టీసీఎస్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా తదితర ఐటీ రంగ షేర్లకు మదుపరులు దూరంగా ఉన్నారు. ఫలితంగా ఐటీ సూచీ 2.65 శాతం పడిపోయింది. జొమాటో, భారతీ ఎయిర్‌టెల్, టాటా స్టీల్, ఎన్టీపీసీ షేర్లూ కోలుకోలేకపోయాయి. రంగాలవారీగా టెలికం 2.26 శాతం, మెటల్ 2.16 శాతం, కమోడిటీస్ 1.53 శాతం, యుటిలిటీస్ 1.42 శాతం కుప్పకూలాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 1.31 శాతం, మిడ్‌క్యాప్ సూచీ 0.78 శాతం మేర నిరాశపర్చాయి.

**ఇదీ సంగతి..**

భారతీయ స్టాక్ మార్కెట్ల నష్టాలకు ప్రధాన కారణాల్లోకి వెళ్తే.. అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లు ముఖ్యంగా అమెరికా ఈక్విటీ నష్టాల ప్రభావం స్పష్టంగా కనిపించింది. దక్షిణ కొరియా, చైనా, హాంకాంగ్ వంటి ఆసియా దేశాల సూచీలూ నిరాశపర్చాయి. అలాగే విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) అదే పనిగా తమ పెట్టుబడులను వెనక్కి తీసుకుంటుండటం కూడా దెబ్బతీసింది.

## మళ్లీ 89వేలు దాటిన పుత్తడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: గత కొన్ని రోజులుగా తగ్గుతూ వచ్చిన బంగారం మళ్లీ ప్రియమైంది. అంతర్జాతీయ మార్కెట్లో అనూహ్యంగా ధరలు పుంజుకోవడంతో దేశీయంగా పుత్తడి ధర మళ్లీ రూ.89 వేల మార్క్‌ను అధిగమించింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో పదిగ్రాముల ధర రూ.350 ఎగబాకి రూ.89,100కి చేరుకున్నట్లు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. గత శుక్రవారం గోల్డ్ రూ.88,750గా ఉన్న విషయం తెలిసిందే. అలాగే 99.5 శాతం కలిగిన పదిగ్రాముల ధర రూ.88,700కి చేరుకున్నది. అయినప్పటికీ వెండి ధరలు నిలకడగా నమోదయ్యాయి. కిలో వెండి లక్ష రూపాయల వద్ద స్థిరంగా ఉన్నది. రాజకీయ అస్థిరత, వాణిజ్య ఉద్రిక్తత నెలకొనడంతో మదుపరులు తమ పెట్టుబడులను సురక్షితమైన బంగారం వైపు మళ్లించడం వల్లనే ధరలు పెరుగుతున్నాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ వర్గాలు వెల్లడించాయి.

## స్మార్ట్‌వాచీలకు గిరాకీ నై

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: దేశంలో స్మార్ట్‌వాచీలకు గిరాకీ తగ్గిపోయింది. గత ఏడాది భారత్‌కు వాటి సరఫరా 30 శాతం పడిపోయింది మరి. వినియోగదారులకు సంతృప్తికర అనుభవం లేకపోవడం, కొరవడిన కొత్తదనం తదితర కారణాలే ఇందుకు కారణమని సోమవారం కౌంటర్‌పాయింట్ రిసెర్చ్ నివేదిక తెలిపింది. ఇది ఫైర్ బోల్ట్, బోట్, నాయిస్ కంపెనీలకు ఎదురుదెబ్బగా పేర్కొన్నది. ఫైర్ బోల్ట్ దిగుమతులు 54 శాతం పడిపోగా, బోట్ 47 శాతం, నాయిస్ 26 శాతం దిగజారాయి. నిరుడు దేశీయ స్మార్ట్‌వాచీ మార్కెట్‌లో నాయిస్ వాటా 27 శాతంగా ఉంటే, ఫైర్ బోల్ట్ 19 శాతం, బోట్ 13 శాతంగానే ఉన్నాయి. 2023లో ఫైర్ బోల్ట్ వాటా 30 శాతంగా, బోట్ వాటా 17 శాతంగా ఉండటం గమనార్హం. అయితే 2024లో టైటాన్‌కు చెందిన ఫాస్ట్‌ట్రాక్ స్మార్ట్‌వాచీల సరఫరా దేశీయ మార్కెట్‌లో 35 శాతం పెరగడం విశేషం. అలాగే రూ.20 వేలకుపైగా ధర కలిగిన స్మార్ట్‌వాచీలకూ మార్కెట్‌లో డిమాండ్ పెరిగిందని కౌంటర్‌పాయింట్ చెప్పింది.

## పన్నుల వసూళ్లలో హుజూరాబాద్ మున్సిపాలిటీ టాప్

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 24: పన్నుల వసూళ్లలో హుజూరాబాద్ మున్సిపాలిటీ రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచినట్లు హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య తెలిపారు. హుజూరాబాద్ మున్సిపాలిటీలో ఉద్యోగులు ఇప్పటివరకు రూ.2.30 కోట్ల రూపాయల ఆస్తి పన్నులు వసూలు చేయగా, రాష్ట్రంలో 86.79 శాతం నమోదైనట్లు వెల్లడించారు. మున్సిపాలిటీలోని ప్రజలు ఆస్తి పన్నులు వందశాతం చెల్లిస్తే ప్రభుత్వం 15వ ఫైనాన్స్ పథకం నుంచి నిధులు మంజూరు చేస్తుందని, తద్వారా హుజూరాబాద్ మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు.

## జాతీయ సమైక్యత శిబిరంలో గురుకుల విద్యార్థిని

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 24: నగునూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థిని, జాతీయ సేవా పథకం వలంటీర్ జి. పుష్పలత ఇటీవల బెంగళూర్‌లో జరిగిన జాతీయ సమైక్యత శిబిరంలో శాతవాహన యూనివర్సిటీ నుంచి పాల్గొనగా, సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీ మాలతి అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సమత, సీనియర్ అధ్యాపకులు ఎస్ పద్మజ, టీ సురేశ్‌కుమార్, వెంకటేశ్వర్లు, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్ కె. గీతారాణి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న మారం జగదీశ్వర్

జగిత్యాల, ఫిబ్రవరి 24: ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తున్నామని టీఈజేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరు శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవోల జిల్లా సంఘ భవన్‌లో ఏర్పాటు చేసిన ఉద్యోగుల సమావేశంలో వారు మాట్లాడారు. కొద్ది రోజుల క్రితం పలు సమస్యల పరిష్కారం కోసం సీఎం రేవంత్‌రెడ్డిని కలువగా, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. అనంతరం వివిధ సంఘాల ప్రతినిధులు రాష్ట్ర చైర్మన్ జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ శ్రీనివాస్‌రావు, టీజీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏనుగు సత్యనారాయణను సన్మానించారు. ఇక్కడ టీ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏనుగు సత్యనారాయణ, టీఎన్‌జీఓల జిల్లా అధ్యక్షుడు మిర్యాల నాగేందర్‌రెడ్డి, గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కందుకూరు రవిబాబు, పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్‌కుమార్, నాలుగో తరగతి ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, కేంద్ర సంఘం నేతలు రాగి శ్రీనివాస్, ఖమ్మం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, టీజీవో జిల్లా కార్యదర్శి మామిడి రమేశ్, పెన్షనర్ల జిల్లా సహా అధ్యక్షుడు పీ హన్మంత్‌రెడ్డి, టీఎన్‌జీవో, టీజీవో నేతలు మహమూద్, సాహేద్‌బాబు, గణేశ్, విజేందర్, అశోక్ రాజు, రాజేందర్‌రెడ్డి, హన్మంతరెడ్డి, రవిచంద్ర, రవీందర్, వేణు, మమత, శైలజ, శ్రావ ణి, ఉమేశ్వరి, శైని మాత్యు, భాగ్య, అరుణ, మధుకర్, శ్రీనివాస్ స్వామి, హరిప్రసాద్, సంపత్, రాంకిషన్‌రావు, సంతోష్, ప్రదీప్, అసద్, హరిప్రసాద్, మోహన్, ముజాహిద్ ఖాన్, మెట్టుదాస్, సత్యనారాయణ, రవీందర్, కిరణ్, మహేశ్ పాల్గొన్నారు.

## అన్నను చంపిన చెల్లెళ్ల అరెస్ట్

జగిత్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 24: ఆస్తి తగాదాలతో అన్నను చంపిన ఇద్దరు చెల్లెళ్లను అరెస్ట్ చేసినట్లు జగిత్యాల టౌన్ సీఐ వేణుగోపాల్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల పట్టణం పోచమ్మవాడకు చెందిన జంగిలి శ్రీనివాస్, అతడి చెల్లెళ్లు భారతపు వరలక్ష్మి, వొడ్నాల శారదకు ఆస్తి విషయంలో గొడవలు జరుగుతున్నా యి. ఈ క్రమంలో జంగిలి శ్రీనివాస్‌ను అతడి చెల్లెళ్లు వరలక్ష్మి, శారద ఆదివారం కర్రతో తలపై బాది పిడిగుద్దులు గుద్ది హత్య చేశారు. శ్రీనివాస్ భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు వరలక్ష్మి, శారదను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.





ఆదివారం రాత్రి దుర్శేడ్ శ్మశానవాటికలో కార్ల లైట్ల వెలుతురులో అంత్యక్రియలు నిర్వహిస్తున్న మృతుడి బంధువులు

## చీకట్లోనే అంత్యక్రియలు

- దుర్శేడ్ శ్మశాన వాటికలో కానరాని లైటింగ్
- కార్ల లైట్ల వెలుతురులో అంత్యక్రియలు
- అధికారుల దృష్టికి తీసుకుపోయినా స్పందన కరువు

కార్పొరేషన్/కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 24 : ఎవరైనా ఓ వ్యక్తి మరణిస్తే ఇబ్బందులు లేకుండా అంత్యక్రియలను పూర్తి చేయాలని చూస్తారు. అందుకే అన్ని గ్రామాలు, పట్టణాల్లోనూ శ్మశాన వాటికల్లో పూర్తిస్థాయి సౌకర్యాల కల్పన కోసం ప్రభుత్వాలతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు వచ్చి సదుపాయాలు కల్పించేందుకు ప్రయత్నాలు చేస్తాయి. కానీ, ఘనత వహించిన నగరపాలక సంస్థలో మాత్రం శ్మశాన వాటికల్లో చీకట్లు కమ్ముకొన్నా పట్టించుకునే దిక్కు లేకుండా పోయింది. నగరపాలక సంస్థలో విలీనమైన దుర్శేడ్ గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన అంత్యక్రియలే దీనికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. దుర్శేడ్ గ్రామంలో ఆదివారం ఓ వ్యక్తి మృతి చెందారు. అంత్యక్రియల నిర్వహణకు సాయంత్రం శ్మశానవాటికకు చేరుకోగానే అక్కడ అంతా చీకటి కమ్ముకుని ఉంది. లైట్లు వెలగడం లేదు. దీంతో చేసేది లేక సెల్‌ఫోన్ లైట్లు, కార్ల లైట్లు వేసుకొని అంత్యక్రియలు పూర్తి చేయాల్సి వచ్చింది. గతంలో గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు ఈ శ్మశాన వాటికలో పూర్తిస్థాయిలో లైటింగ్ ఉందని, నగరపాలక సంస్థలో విలీనమైన తర్వాత లైట్లు వెలుగడం లేదు. మరమ్మతులు చేయించాలని అధికారుల దృష్టికి తీసుకుపోయినా ఎవరూ స్పందించలేదని మాజీ ఉప సర్పంచ్ సంపత్‌రావు తెలిపారు. రాత్రి సమయంలో శ్మశాన వాటికలో లైటింగ్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక వార్డు ఆఫీసర్‌ను ప్రశ్నించినా సరైన సమాధానం ఇవ్వడం లేదని, కేవలం ఆస్తి పన్నుల వసూళ్లకే వారు పరిమితం అవుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఈ విషయంలో ఇప్పటికైనా నగరపాలక ఉన్నతాధికారులు వెంటనే స్పందించి శ్మశానవాటికల్లో లైటింగ్ ఏర్పాటు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌కు సీఎం



మంత్రులు, ఎమ్మెల్యేలతో సమీక్షిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



ఎస్ఎల్ గౌడ్‌ను అడ్డుకుంటున్న పోలీసులు

తిమ్మాపూర్, ఫిబ్రవరి 24: కరీంనగర్ పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి తిరిగి హైదరాబాద్ వెళ్తూ ఎల్ఎండీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి సోమవారం రాత్రి 8గంటల సమయంలో వచ్చారు. రోడ్డు మార్గాన వెళ్తున్న ఆయనను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆహ్వానించడంతో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, పలువురు ఎమ్మెల్యేలతో కలిసి క్యాంపు ఆఫీస్‌కు చేరుకుని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలతో సమీక్ష నిర్వహించారు.

***సెక్యూరిటీ ఓవరాక్షన్***

సీఎం రేవంత్‌రెడ్డి వచ్చారన్న సమాచారం తెలుసుకున్న మండల కాంగ్రెస్ నాయకులు కొద్దిమొత్తంలో క్యాంపు ఆఫీస్‌కు చేరుకోగా సీఎంతో వచ్చిన సెక్యూరిటీ సిబ్బంది ఓవరాక్షన్ చేశారు. దీంతో కష్టపడి గెలిపించుకుంటే కనీసం లోపలికి వెళ్లనివ్వడం లేదని పలువురు కార్యకర్తలు గుసగుస పెట్టుకున్నారు. తాజా మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిని సైతం రెండు, మూడు నిమిషాలు గేటు వద్ద నిల్చోబెట్టారు. తర్వాత పక్కనున్న గేటు నుంచి పంపించారు. అలాగే బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్ఎల్‌గౌడ్ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో ఆయన కొంత అసహనం వ్యక్తం చేశారు. సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. వీడియోలు తీస్తున్న ఓ విలేఖరి ఫోన్‌ను గుంజుకుని అతి చేశారు. సీఎం వెళ్లిన తర్వాత పార్టీ మండలాధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి కార్యకర్తలను సముదాయించారు.

## డాబాపై నిద్రిస్తే.. ఇల్లు లూటీ

- ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు చోరీ

జగిత్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 24: జిల్లా కేంద్రంలోని టవర్ సర్కిల్ ప్రాంతానికి చెందిన గుండేటి రాజశేఖర్ ఆదివారం రాత్రి ఇంటికి తాళం వేసి డాబాపై పడుకున్నాడు. సోమవారం తెల్లవారుజామున రాజశేఖర్ కిందికి వచ్చి చూడగా, ఇంటి తాళాలు పగులగొట్టి, బీరువా తెరిచిఉండడం, సామగ్రి చిందరవందరగా పడి ఉండడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించాడు. వెంటనే జగిత్యాల టౌన్ పోలీసులకు సమాచారం అం దించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ సేకరించి చోరీ జరిగిన విధానాన్ని పరిశీలించారు. బీరువాలోని ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితుడు వాపోయాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జగిత్యాల టౌన్ పోలీసులు తెలిపారు.

## బీసీ అభ్యర్థులకు ఓటేయండి.. కాదు.. పార్టీ అభ్యర్థిని గెలిపించండి..

- కాంగ్రెస్‌లో ఇద్దరు నాయకుల భిన్న ప్రచారం
- సీఎం సభ పెట్టిన కరీంనగర్‌లోనే.. తీన్మార్ మల్లన్న బీసీలతో చర్చా వేదిక

కరీంనగర్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ) : ఒకే పార్టీ నుంచి ఇద్దరు నాయకులు వచ్చి ఒకరు బీసీ అభ్యర్థులకు ఓటు వేయాలని చెబితే.. మరొకరు పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. సోమవారం కరీంనగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఎస్ఆర్ఆర్ కళాశాల మైదానంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభను నిర్వహిస్తే ఇందుకు పోటీగా అదే పార్టీ ఎమ్మెల్సీ స్థానిక మైత్రీ రెసిడెన్సీలో బీసీల సమాలోచన సభ నిర్వహించడం చర్చా నీయాంశమైంది. ఒకే పార్టీలోని భిన్న ధ్రువాలుగా వ్యవహరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఒకే చోట సమావేశాలు పెట్టి వేర్వేరు అభ్యర్థుల కోసం ప్రచారం చేయడం కాంగ్రెస్ పార్టీలో చర్చకు దారి తీసింది. వివరాల్లోకి వెళ్తే.. కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ సోమవారం రాత్రి సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, ఉత్తంకుమార్ రెడ్డి, సీతక్క, ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ఎస్ఆర్ఆర్ కళాశాల మైదానంలో బహిరంగ సభ నిర్వహించారు. పార్టీ అభ్యర్థిని గెలిపించాలని పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. అంతకు ముందు ఇదే కరీంనగర్‌లోని మైత్రీ రెసిడెన్సీలో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కూడా బీసీల రాజకీయ సమాలోచన సభ నిర్వహించారు. ఈ సభకు బీఎస్పీ అభ్యర్థిగా ఉన్న ప్రసన్న హరికృష్ణ మల్లన్న రాక ముందే హాజరై తనకు ఓటు వేయాలని బీసీ పట్టభద్రులను అభ్యర్థించారు. బీసీ సభలో పాల్గొన్న మల్లన్న మాట్లాడుతూ తాను ఎవరికి ఓటు వేయాలో చెప్పనని, ఎందుకంటే మీరు ఎవరికి ఓటు వేయాలో ఇప్పటికే డిసైడ్ అయిపోయారని చెప్పుకొచ్చారు. బీసీలుగా ఉండి రెడ్డిలకు ఓటు వేస్తే మన బిడ్డలను మనమే చంపుకొని భుజాలపై వేసుకుని వెళ్లినట్లుగా ఉంటుందని రెడ్డి అభ్యర్థులకు ఓటు వేయవద్దని చెప్పకనే చెప్పినట్లయింది. కాగా, ఇదే సమావేశంలో పాల్గొన్న బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు మాత్రం కుండ బద్దలు కొట్టినట్లు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు, టీచర్స్ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి మల్క కొమరయ్యకు ఓటు వేయాలని స్పష్టం చేశారు. చిరంజీవులు ప్రసంగించినపుడు తీన్మార్ మల్లన్న కూడా వేదికపైనే ఉండడం విశేషం. కాగా, ఇదే విషయం ఇపుడు కాంగ్రెస్ పార్టీలో కాక రేపుతున్నది. బీసీల ఓట్లు తమకు పడతాయా? లేదా అనేది ఆ పార్టీ నాయకులను గందర గోళానికి గురి చేస్తున్నది.

## చోరీ కేసులో నలుగురికి జైలు

కథలాపూర్, ఫిబ్రవరి 24: ఇప్పపెల్లి గ్రామంలో ట్రాక్టర్ బ్యాటరీలు చోరీ చేసిన కేసులో నలుగురికి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ కోరుట్ల న్యాయమూర్తి పావని సోమవారం తీర్పునిచ్చారని కథలాపూర్ పోలీసులు తెలిపారు. గతేడాది జూలై 9న నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన సురేశ్, గంగప్రసాద్, ఎస్కే ఆసీఫ్, డిచ్‌పల్లికి చెందిన ఎస్కే ఖదీర్ ట్రాక్టర్ బ్యాటరీల దొంగతనానికి పాల్పడగా, అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. సాక్షుల విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో నలుగురికి జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారని పోలీసులు తెలిపారు.

## యూరియా కోసం.. చెప్పుల వరుస

- నుస్తులాపూర్ సొసైటీ ఎదుట ఘటన

తిమ్మాపూర్, ఫిబ్రవరి 24: యూరియా కోసం తిమ్మాపూర్ మండల రైతులకు తిప్పలు తప్పడం లేదు. రోజులు గడుస్తున్న కొద్దీ కొరత తీవ్రమవుతుందే తప్ప తీరడం లేదు. గత కొద్ది రోజులుగా సొసైటీలు, ప్రైవేటు దుకాణాల్లో యూరియా విక్రయాలు జరుగుతున్నా.. రైతులకు సరిపడా అందడం లేదు. యూరియా వచ్చిందని తెలిస్తే చాలు రైతులు పనులన్నీ వదిలేసి యూరియా వేటలో పడుతున్నారు. సోమవారం నుస్తులాపూర్ సొసైటీకి యూరియా లోడ్ వచ్చిందని తెలుసుకున్న రైతులు ఉదయం నుంచి లైన్లో నిల్చోలేక చెప్పులను వరుసలో పెట్టి నీడకు కూర్చున్నారు. ప్రస్తుతం వరి పొట్ట దశలో ఉండడంతో ఆలస్యమైతే పంట సరిగా రాదని, దిగుబడి తగ్గుతుందని అందుకే తిప్పలు పడైనా యూరియా తెచ్చుకోవడానికి ప్రయత్నం చేస్తున్నమని రైతులు చెబుతున్నారు. అధికారులు సరిపడా నిల్వలు ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.